క్లుప్తంగా

ఘనంగా పైడిమాంబ అంబలం పూజ



అంబలం పూజలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెంలో పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం వెలంవీధి ప్రాంగణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ యూత్ ఆధ్వర్యంలో అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. 108 కలశాలతో ఊరేగించి అమ్మవారికి అభిషేకం చేశారు. అర్చకులు వేమకోటి ఆంజనేయ శర్మ కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. పోతురాజుకు ప్రత్యేక పూజ అనంతరం పడి వెలిగించారు. అమ్మవారి భక్తిగీతాల ఆలాపనతో ప్రాంగణం మార్మోగింది. భవాని మాలధారులు, స్థానికులకు అంబలం పూజలో తీర్థప్రసాదాలతో పాటు అల్పాహారం అందించారు. గ్రామ కమిటీ సభ్యులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ ఉద్యోగులు, సిబ్బంది కోసం శుక్రవారం ప్రత్యేక ఉచిత మెడికల్ క్యాంప్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో డివిజనల్ రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్‌కే తిరు అరుల్‌జోతి, డాక్టర్ చారుమతి, డాక్టర్ లక్ష్మణరావు(ఏసీఎంఎస్) పర్యవేక్షణలో ఈ శిబిరం జరిగింది. రైల్వే హాస్పిటల్ వైద్య బృందం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'ప్రస్తుత కాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తలు' వివరించారు. కార్యక్రమానికి వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బోరా ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆరోగ్య సంరక్షణ, విలువలతో కూడిన పోషకాహారం ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో సుమారు 85 మందికి వైద్య పరీక్షలు చేశారు.

డెబ్రిస్ తొలగించండి



బీటీఆర్‌నగర్ రోడ్డులో పేరుకుపోయిన డెబ్రిస్, చెట్ల కొమ్మలు

సీతంపేట: ప్రధాన రహదారుల్లో డెబ్రిస్, చెట్ల కొమ్మలు కుప్పలుగా పడవేస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. జీవీఎంసీ 25వ వార్డు బీటీఆర్ కాలనీ 80 అడుగుల రోడ్డులో డెబ్రిస్, తొలగించిన చెట్ల కొమ్మలు కుప్పలుగా పడేశారు. వారం రోజులుగా వాటిని తొలగించడానికి ఎవరూ ముందుకు రాలేదు. ప్రధాన రహదారిలో డెబ్రిస్ పడేస్తున్నా జీవీఎంసీ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో నమాజ్




నమాజ్ ఆచరిస్తున్న ముస్లింలు

మత్రిపాలెం: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదుల్లో మొదటి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్‌నగర్‌లో ఉన్న మజీద్-ఈ-అల్ ఖదీర్‌లో నిర్వహించిన మధ్యాహ్నం నిర్వహించిన జుమ్మా నమాజ్‌లో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌల్వీలు రంజాన్ నెల ప్రాధాన్యం, ఉపవాసాల ప్రాశస్త్యాన్ని వివరించారు. పేదలకు దానధర్మాలు చేశారు. సాయంత్రం ఘనంగా ఇఫ్తార్ విందు జరిగింది. మసీదు కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.

భద్రతపై అవగాహన

బీచ్‌రోడ్డు: 54వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ (ఎన్ఐఎఫ్ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో భద్రతపై క్విజ్, వ్యాసరచన, ప్రసంగ, క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు.ఊహించని అగ్ని ప్రమాదాలకు ఎలా స్పందించాలో ఫైర్ ఫైటింగ్ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమాల్లో జనరల్ మేనేజర్ ఆపరేషన్స్ కుసుమ కుమారి, జనరల్ మేనేజర్ ప్రాజెక్ట్స్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆమెకు వందనం



అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళ

కుటుంబ పోషణలోను.. కళ, క్రీడా రంగాల్లోనూ తనదైన ముద్ర

నేడు మహిళా దినోత్సవం..

స్త్రీలే సమాజంలో నిజమైన వాస్తుశిల్పులు అన్నాడొక దార్శనికుడు వెనుకటి రోజుల్లో. ఇంటి నుంచి కార్యాలయం వరకు తమ కనుసన్నల్లోని దేనినైనా వారు అందంగా తీర్చిదిద్దగలరు. రంగం ఏదైనా వారు నిజాయితీగా శ్రమిస్తారు. విజయ ఫలాలను నలుగురితో పంచుకుంటారు. పుట్టినప్పటి నుంచి కడ వరకు ఎన్నో ఆటుపోట్లను చవిచూస్తున్నా చెదరని చిరునవ్వే ఆమె ఆభరణం. ఆమె ధీరత్వానికి.. కార్యదక్షతకు ఈ మహిళా దినోత్సవ వేళ హ్యాట్సాఫ్.. – సీతంపేట/మురళీనగర్/కంచరపాలెం

మహిళలు ఇంటికే పరిమితం కారాదు..



నాకు ఒకమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. ఇంట్లో గృహిణిగా రాణిస్తూ, నాటికలు, కామెడీ స్కిట్స్, సినిమా డైరెక్షన్, సామాజిక సేవా రంగాల్లో గత ఎనిమిది సంవత్సరాలుగా పని చేస్తున్నాను. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్, హాస్యవల్లరి కామెడీ క్లబ్‌లలో స్కిట్స్ ప్రదర్శించి ప్రేక్షకులను నవ్విస్తూ వారి మన్ననలు అందుకుంటుంటే చాలా ఆనందమనిపిస్తుంది. 2016 నుంచి పలు నాటకాల్లో ఆర్టిస్ట్‌గా నటించాను. అలాగే నా డైరెక్షన్‌లో నాటికల ప్రదర్శన కూడా జరిగింది. ప్రస్తుతం సంకల్పం, భౌభౌ, కల హాల కాపురం తదితర నాటికలు ప్రదర్శిస్తున్నాను. ఇప్పటి వరకు 8 సినిమాలకు అసిస్టెంట్‌గా, అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసాను. నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా కార్యదర్శిగా, రెడ్‌క్రాస్ మెంబర్‌గా సామాజిక సేవా రంగంలో చురుగ్గా పని చేస్తున్నాను. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా కళ, సామాజిక రంగాల్లో రాణించి తమకంటూ గుర్తింపు సంపాదించుకోవాలన్నది నా కోరిక.

– పుష్యమి సుధ, కళాకారిణి, కంచరపాలెం

సేవల్లో మేటి డాక్టర్ శశి ప్రియాంక..



కంచరపాలెం ఆర్పీపేట అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)లో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మట్టా శశి ప్రియాంక సేవల్లో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గైనిక్ సమస్యలపై సేవలందించడంలో ఆమె ముందుంటారు. కరోనా కాలంలో తనదైన శైలిలో ప్రజలకు సేవలందించారు. అంతే కాకుండా ఫోన్ ద్వారా ఉచితంగా సలహాలు అందిస్తున్నారు. ఆమె సేవలను మహిళా రోగులు కొనియాడుతున్నారు. అలాగే సిబ్బంది కూడా సేవల్లో ఆమె చిత్తశుద్ధి పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సేవాపథమే ఆమె ఆశయం..



సరకులు అందజేస్తున్న కీర్తి పట్నాయక్



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మురళీనగర్‌లోని శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. సొంత నిధులతో 22 ఏళ్ల పాటు ఒంటి చేత్తో ట్రస్టును నడిపిస్తున్నారు. 2003లో మార్చి 3వ తేదీన మహిళల సాధికారత కోసం ఆమె ఈ ట్రస్టును స్థాపించారు. మహిళలను విద్యావంతులను చేయడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించి వారు ఆర్థికంగా నిలబడేందుకు తోడ్పడేవారు. అనంతర కాలంలో ఆమె పేద విద్యార్థుల విద్యా వ్యాప్తికి అవసరమైన సాయం అందించారు. తన తండ్రి జ్ఞాపకార్థం నెలకు 25 మంది నిరుపేదలైన సీనియర్ సిటిజన్స్‌కు రేషన్ అందిస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తూ వారికి అవసరమైన దుస్తులు, చీరలు అందిస్తున్నారు.

పలు అవార్డులు.. రివార్డులు..

ఆమెకు అనేక సంస్థలు అనేక అవార్డులతో సత్కరించాయి. మధురైలోని అబ్దుల్ కలాం ఇనిస్టిట్యూట్ ఆమెకు ఉత్తమ సేవా పురస్కారం, రాష్ట్ర స్థాయిలో బయో డైవర్సిటీ బోర్డు ఆమెకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డు, ఇండియన్ నేవీ ప్రశంసా పత్రం, అనేక సంస్థలు, ప్రభుత్వ సంస్థలు ఆమెకు అవార్డులు అందించాయి.

పరదేశమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీలో గల పరదేశమ్మ ఆలయ 23వ వార్షికోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మే 13వ తేదీన నీలాభిషేకం, 19వ తేదీన తొలేళ్లు, 20వ తేదీన ప్రధాన పండగ నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో గౌరవ అధ్యక్షుడు బోర వెంకట రమణారెడ్డి, అధ్యక్షుడు దాడి శ్రీనివాసరావు, కార్యదర్శి కోరాడ సత్య శివరావు రెడ్డి, కోశాధికారి జీరు శ్రీనివాసరెడ్డి, ఆడిటర్ మొల్లేటి వెంకట అప్పారావు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను శుక్రవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, వీరి వద్ద నుండి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె. శాంతారాం, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణ సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన రెడ్డిపల్లి మధుసూదన్, సుర శ్రావణ్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న విషయం గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని జీఆర్పీ ఎస్ఐ కె. శాంతారాంకు అప్పగించారు. వారి వద్ద నుండి రూ. 25 వేల విలువైన 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

నేతల విగ్రహాల ముసుగులు తొలగింపు



నక్కవానిపాలెంలో ముసుగు తొలగించిన మహానేత రాజశేఖర్‌రెడ్డి విగ్రహం

సీతమ్మధార: ఎన్నికల కోడ్ ముగియడంతో జోన్-3లో గల ఫ్లెక్సీలు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలిగించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శివప్రసాద్ మాట్లాడుతూ 42 మంది రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలిగించినట్లు తెలిపారు. అలాగే 40 హోర్డింగులు, 205 బ్యానర్లు, 350 వివిధ పార్టీల జెండాలు, 180 ఫ్లెక్సీలు తొలగించినట్లు తెలిపారు.

అన్ని రంగాల్లో అగ్రపథాన మహిళలు



మహిళా ఉద్యోగులతో ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



మహిళా సిబ్బందితో ఈకార్వో ప్రతినిధులు



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న డీఆర్ఎం లలిత్ బోరా

సీతమ్మధార: మహిళలు అన్ని రంగాల్లో అగ్రపథాన నిలుస్తున్నారని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ప్రసంశించారు. మార్చి 8వ తేదీ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎండీ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు తమ దైనందిన జీవితంలో గృహిణిగా, ఉద్యోగిగా విభిన్న పాత్రలు నిర్వర్తిస్తూ ఇంటిని, సంస్థను అగ్రపథంలో నిలుపుతున్నారని ప్రసంశించారు. సంస్థలోని ఆఫీస్ అసిస్టెంట్లలో కొంత మంది మహిళలను జేఎల్ఎం ట్రెనింగ్‌కి పంపించామని, సంస్థ చేపట్టే తదుపరి నియామకాల్లో మహిళలకు కూడా అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థలో అగ్రభాగాన నిలిచిన ఆపరేషన్స్ డైరెక్టర్ వి.విజయలలిత, సీజీఎంలు డి.సుమన్ కళ్యాణి, బి.సులేఖరాణి, జీఎంలు ఎస్.పార్వతి, ఎం.విజయచాముండి, పి.శ్రీదేవిలను సీఎండీ, డైరెక్టర్లు సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.చంద్రం, బి.రామచంద్ర ప్రసాద్, వి.విజయలలిత, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.వి.రామకృష్ణప్రసాద్, చీఫ్ జనరల్ మేనేజర్లు డి.సుమన్ కళ్యాణి, టి.వి.ఎస్.ఎన్.మూర్తి, అచ్చి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రగతిలో మహిళల పాత్ర అద్భుతం..

తాటిచెట్లపాలెం: భారతీయ రైల్వే ప్రగతిలో మహిళల పాత్ర అమోఘమని వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ప్రశంసించారు. శుక్రవారం ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, మహిళా విభాగం ఆధ్వర్యంలో దొండపర్తిలో గల యూనియన్ కార్యాలయం వద్ద నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్య అతిథులుగా డీఆర్ఎం దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మహిళలు రైల్వేలో పోషిస్తున్న కీలక పాత్ర, వారి భాగస్వామ్యాన్ని కొనియడారు. ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా కార్మికులకు కల్పించాల్సిన మౌలిక వసతుల గురించి, మహిళల హక్కుల గురించి ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ పి. రామమోహనరావు వివరించారు. మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఈ. శాంతారాం, ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు పీవీజే రాజు, జోనల్ కార్యదర్శి బి. దామోదరరావు, కేంద్ర నాయకులు యు.ఎల్. నాగరాణి, అధిక సంఖ్యలో మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

ఈకార్వో ఆధ్వర్యంలో..

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (ఈకార్వో) ఆధ్వర్యంలో వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రైల్ క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోరా విచ్చేశారు. జాతీయ వృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన 53 మంది మహిళా సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఖుషి సోని, డాక్టర్ భాసిని, ఈకార్వో వైస్ ప్రెసిడెంట్ మధుస్మిత సాహూ, సెక్రటరీ అంకిత శర్మ, ట్రెజరర్ నిధి భటి తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో మార్పులు అవసరం



సెమినార్‌లో పాల్గొన్న కృష్ణా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

మద్దిలపాలెం: ప్రపంచ అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలంటే విద్యా రంగం కూడా మారాల్సిన అవసరముందని డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కృష్ణా కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఇండస్ట్రీ-అకడమియా ఇంటర్‌ఫేస్-2025 సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరిశోధనలపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు కమ్యూనిటీ సేవా ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాలలో అందిస్తున్న 25 సింగిల్-మేజర్ కోర్సులు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఆర్గానిక్ ఫార్మింగ్ వంటి ఆధునిక, సంప్రదాయ కోర్సుల గురించి వివరించారు. అదనంగా 7 పోస్ట్-గ్రాడ్యుయేషన్ కోర్సులను ప్రస్తావించారు. పరిశ్రమల నిపుణులు సహా సుమారు 50 మంది ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు పారిశ్రామికాభివృద్ధిలో డీఐసీ పాత్రను వివరించారు. మత్స్య రంగంలో అవకాశాలు, సవాళ్లను మత్స్య పరిశ్రమ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు విశదీకరించారు. కార్యక్రమంలో స్ప్రింట్ మేనేజింగ్ డైరెక్టర్, అఖిల భారత ఆక్వా కల్చర్ అధ్యక్షుడు పి.పవన్‌కుమార్, హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఆర్.వి.రమణ, ఎస్‌బీఐ రీజనల్ బిజినెస్ చీఫ్ మేనేజర్ ఎల్.అశోక్ కుమార్, ఐజీఐఏటీ డైరెక్టర్ బి.వినోద్‌కుమార్, హిందూ బ్యూరో చీఫ్ సుమిత్ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారన్నారు. ఉదయం 7.30గంటలకు బాలభోగం, 9.30గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30గంటలకు రాజభోగనివేదన ఉంటుందని తెలియజేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన ఉంటుందన్నారు. సాయంత్రం 6.30గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారని వివరించారు.

భవిత సెంటర్‌కు వితరణ



భవిత సెంటర్‌కు వస్తువులు అందజేస్తున్న దాతలు

ఆరిలోవ: తోటగరువు ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఆసరాగా నిర్వహిస్తున్న భవిత కేంద్రానికి దాతలు సహకారం అందిస్తున్నారు. సింహాచలం ప్రాంతానికి చెందిన దాతలు వారి బంధువు ఉమామహేశ్వరరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఈ కేంద్రానికి ప్యూర్‌ఫై వాటర్ ఫిల్టర్ వితరణ చేశారు. దాతలకు కేంద్రం టీచర్లు ఎస్.కె.సలీమ్ పాహిజీ, ఎస్.మహాలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

పగలే వెన్నెల

- కొండవాలు కాలనీల్లో పట్టపగలూ వెలుగుతున్న వీధి దీపాలు
- అనవసర వినియోగం వల్ల దీపాల నాణ్యత.. జీవితకాలం తగ్గి మళ్లీ చీకట్లు అలుముకుంటాయని స్థానికుల ఆవేదన
- దృష్టి సారించని సంబంధిత అధికారులు



వరాహగిరికాలనీలో పగలు కూడా వెలుగుతున్న స్ట్రీట్‌లైట్స్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతాలైన వరాహగిరికాలనీ -1.2, సత్యసాయినగర్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల వీధి దీపాలు పగలూ, రాత్రీ వెలుగుతూనే ఉన్నాయి. ప్రతిరోజు సాయంత్రం పూట వెలిగి, ఉదయమే వీధి దీపాలు ఆరాలి. అన్ని చోట్లా ఇదే పద్ధతి కొనసాగుతుంది. కానీ ఈ కాలనీల్లో మాత్రం పగలూ రాత్రీ వీధి లైట్లు వెలుగుతూనే ఉంటున్నాయి. ఇక్కడ మరో సమస్య ఏమిటంటే.. ఇలా వేళ కాని వేళలో వెలిగే వీధి దీపాలు కొన్ని రోజుల తర్వాత పూర్తిగా వెలగడం మానేసి అంతటా అంధకారం అలుముకుంటుంది. కొండవాలు ప్రాంతాల్లో చాలా కాలం అసలు స్ట్రీట్‌లైట్స్ లేవు. ఉన్నా అవి పూర్తి స్థాయిలో వెలిగేవి కావు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో ప్రతి వీధిలో పూర్తిస్థాయిలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. 2024 ఎన్నికల నేపథ్యంలో కోడ్ కారణంగా అవి కూడా పూర్తిగా ఏర్పాటు చేయడానికి వీలు కాలేదు. అప్పట్లో మంజూరైన విద్యుత్ లైన్లు, వీధి దీపాలు ఇటీవలే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి వరకు చీకట్లో విషసర్పాలు, ఆకతాయిల భయంతో కాలం గడిపిన కాలనీ వాసులు తమ కాలనీల్లో రాత్రి వేళల్లో చక్కని లైటింగ్‌తో, వీధి దీపాల వెలుగుల్లో సుఖంగా ఇళ్లకు చేరుకునేవారు. కానీ ఇటీవల కాలంలో ఈ వీధి దీపాలు పగలంతా వెలుగుతుండడంతో ఇలా వెలగడం వలన ఇవి మళ్లీ పాడైపోయి, తమ కాలనీల్లో చీకట్లు అలుముకుంటాయేమోనని స్థానికులు భయపడుతున్నారు. వాస్తవానికి ఇలా నిరంతరం ఈ దీపాలు వెలగడం వల్ల వీటి నాణ్యత తగ్గిపోవడం, లైటింగ్ కాంతిలో తేడా, జీవిత కాలం తగ్గడం వంటి నష్టాలుంటాయి. ఇదే పరిస్థితి గతంలోనూ ఇక్కడ ఎదురైంది. కానీ మళ్లీ ఇప్పుడు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. పగలూ, రాత్రి కూడా ఇక్కడ లైట్లు వెలగడం వల్ల కొంచెం ఇబ్బందిగానే ఉంటుందని, వినియోగదారుల వద్ద నుండి ముక్కుపిండి మరీ విద్యుత్ బిల్లులు వసూలు చేసే సిబ్బంది వీటి నిర్వహణపై ఎందుకు దృష్టి సారించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల ఎంత విద్యుత్ నష్టం జరుగుతుందో వారికి తెలియడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఇలా ఎక్కడెక్కడ జరుగుతుందో ఆయా ప్రాంతాల్లో తగు చర్యలు తీసుకుని విద్యుత్ ఆదా చేయాలని కోరుతున్నారు.